# స్వయంకృతం

## దేవినేని ఉష



కాలింగ్‌బెల్ మోగింది.

ఆ మోగటంలో ఏదో కంగారు ఉన్నట్టుగా స్పీడ్‌గా మోగింది.

వంటగదిలో గాస్‌స్టవ్ దగ్గర నిలబడి ప్యాన్‌లో ఫ్రై చేస్తున్న హారిత స్టవ్ తగ్గించి హాల్లోకి నడిచింది. మధ్యాహ్నం పన్నెండు దాటుతోంది. పిల్లలు ఇద్దరు కాన్వెంట్‌కు వెళ్లిపోయారు.

ఉదయం వాళ్ళ ఇద్దరి వరకూ కొంచెం అన్నం, పప్పో, కూరో ఏదో ఒకటి చేసేసి వాళ్ళను పంపించేస్తుంది. తొమ్మిది గంటలకు టిఫెన్‌తిని భర్త శ్రీరామ్ ఆఫీస్‌కు వెళ్ళిపోతాడు.

అతను లంచ్‌కు వచ్చేసరికి తమ ఇద్దరికీ వేడి వేడి అన్నం, కూరలు చేసి ఉంచుతుంది.

శ్రీరామ్ లంచ్‌కు ఇంకా టైమ్ ఉంది కనుక వచ్చింది అతను అయి ఉండడని హారిత ఉద్దేశ్యం.

కాలింగ్‌బెల్ ఆగకుండా మోగుతూనే ఉంది.

'సెన్స్‌లేని మనుషులు' తిట్టుకుంటూ తలుపు తీసింది. నిండా చెమటలతో, ఒణికిపోతూ నిలబడి ఉన్న శ్రీరామ్ చటుక్కున హారితను తోసుకుంటూ లోపలకు వచ్చి డోర్‌లాక్ చేసేసాడు.

అతన్ని ఆ స్థితిలో చూసిన హారిత కంగారు పడింది.

"ఏంటండీ!" అడిగింది.

"హారితా క్విక్! మన ఇంటిమీద రెయిడ్ జరపటానికి వస్తున్నారు. ఇంత సామాను, బీరువానిండా ఖరీదైన చీరలు, నగలు ఇవన్నీ వాళ్ళకు దొరికిపోతే నేను కటకటాల వెనక్కి వెళ్ళిపోతాను. వీటిని కొన్నిటినైనా ఎక్కడైనా దాచెయి!"

భయంలో శ్రీరామ్ గుండె గొంతులోకి వచ్చినట్టుంది. ఈసారి వణికిపోవటం హారిత వంతు అయింది. ఇంట్లో ఎటు చూసినా లక్ష్మి తాండవిస్తోంది. ఇంత హఠాత్తుగా ఈ సిరిని అంతా ఎలా మాయంచేయటం?

"ఉండండి పక్కవాళ్ళను అడిగి వస్తాను" డోర్ దగ్గరకు నడవబోయింది.

"షటప్! నువ్వు అడిగి వచ్చేంత టైమ్ లేదు. వాళ్లు వచ్చేస్తారు. మొదట పాస్ బుక్‌లు, బంగారం తీసుకువెళ్లు హరియప్!

ఉద్రేకంగా అరిచాడు.

శ్రీరామ్ మెదడు పగిలిపోయేంత టెన్షన్‌గా ఉంది. అతను ఒక గవర్నమెంట్ ఆఫీస్‌లో కీలకమైన పోస్ట్‌లో ఉన్నాడు.

ఆ ఆఫీస్ మొత్తానికీ ఏ కాగితం కదలాలన్నా అతని సంతకం కావాల్సిందే. ముప్పయి అయిదేళ్ళ ఉడుకు రక్తం వాడైనా అతనిలో ఉన్నత ఆశయాలు ఏమాత్రం లేవు. ధనం మీద, సుఖాలమీద అతనికి ఎంతో కోరిక. వచ్చే జీతం సంగతి ఎలా ఉన్నా అతను లంచాల్లో ఎంతో డబ్బు సంపాదించాడు. ప్రతి బిల్ తొక్కిపట్టేసి తను సంతకం చేయటానికి ఎంతో లంచం ప్రతిఫలంగా పొందేవాడు. అతని ఇంట్లో డబల్‌కాట్, ఫ్రిజ్, ఒనిడా కలర్ టీవీ, మిక్సీ, గ్రైండర్, రెండు గాస్‌స్టవ్‌లు వాటికి స్పేర్ సిలిండర్స్, టూ ఇన్ వన్ ఇంకా ఎన్నో ఆధునిక పరికరాలు ఉన్నాయి.

బెడ్‌రూం ధనవంతుల బెడ్‌రూంలా కళాత్మకంగా ఉంటుంది. ఆ రూమ్‌లో నిలువెత్తు బీరువాలు రెండు. అవి గాడ్రేజ్‌వి. వాటినిండా ఖరీదైన బట్టలు, నగలు, వెండి సామానులు

కొల్లలుగా ఉన్నాయి. ఎంత ఉన్నత అధికారి అయినా ఆ జీతం మీద ఇల్లు అలా మెయింటెన్స్ చేయుటం చాలా కష్టం. కానీ శ్రీరామ్‌కు అది చాలా సులువుగా జరుగుతోంది. కారు ఒక్కటి కొనలేదు. కానీ స్కూటర్‌తో సహా అతనికి అన్నీ ఉన్నాయి.

భార్యపేర, పిల్లలపేర, తనపేర ఉన్న పాస్‌బుక్‌లు బీరువాలో ఉన్నాయి.

అతని లంచాల తత్వానికి విసిగిపోయిన వారు ఎవరో అవినీతి నిరోధక శాఖ వారికి ఫిర్యాదు చేసారేమో తెలియదు కానీ అతను ఆఫీస్‌లో ఉండగా, అతని ఇంటిమీద అవినీతి శాఖవారు రెయిడ్ జరపబో తున్నట్టుగా తెలుసుకున్న ఒక ముఖ్య స్నేహితుడి నుండి ఆఫీస్‌లో ఉన్న శ్రీరామ్‌కు ఫోన్‌ద్వారా తెలిసింది.

అతను కంగారుగా ఇంటికి వచ్చాడు.

హరిత చకచకా శ్రీరామ్ అందించిన నగలపెట్టె, పాస్‌బుక్‌లు తీసుకుని పక్క ఇంటికి వెళ్ళాలని డోర్ తీసింది.

హరిత స్థాణువు అయింది.

ఎదురుగా నిలబడ్డ వ్యక్తులను చూస్తూ, శ్రీరామ్ కూడా నిశ్చేష్టుడు అయ్యాడు.

అవినీతి నిరోధక శాఖవాళ్ళు హరిత చేతిలోనివి అందుకున్నారు.

నడుంలో పట్టు తప్పినట్టయి హరిత

# స్వయంకృతం

అక్కడే కూలబడింది.

శ్రీరామ్ దగ్గర ఒక వ్యక్తి నిలబడ్డాడు.

మిగిలిన ముగ్గురూ అతని ఇల్లంతా సోదా చేసారు. అతన్ని అడగవలసిన ప్రశ్నలు అడిగారు. శ్రీరామ్ చెప్పిన జవాబులు వాళ్లకు ఏ మాత్రం సంతృప్తిగా లేవు.

శ్రీరామ్‌ను అరెస్ట్ చేసారు. అతన్ని తీసుకుని వెళ్లిపోయారు.

అతని ఆస్తికి సీల్ చేసారు.

హరిత దిక్కుతోచని దానిలా అయిపోయింది. ఈ హడావుడికి ఇరుగు, పొరుగు వాళ్ళంతా వచ్చి పడ్డారు.

అంతకాలం హరిత అనుభవిస్తున్న విలాసాలకూ, ఆమె ఐశ్వర్యానికి అసూయ చెందుతున్న వాళ్ళకు ఇప్పుడు హరితమీద కాస్తయినా జాలి కలగలేదు. 'మంచి ఉద్యోగం కదా దాంతో బ్రతక్క లంచాలకుపోతే ఇలాగే ఉంటుంది.'

'అంతా మూడునాళ్ళ ముచ్చటే. న్యాయమైన సొమ్ము అయితే నిలుస్తుంది. కానీ ఇలాంటిసొమ్ము ఎలా వచ్చిందో అలానే పోతుంది.'

అందరూ విమర్శిస్తుంటే అసలే కృంగిపోయి ఉన్న హరిత గుండెమీద సమ్మెట దెబ్బల్లా ఉన్నాయి. స్టవ్‌మీద ప్యాన్‌లో ఫ్రై మాడిపోతున్న వాసన వస్తుంటే ఎవరో వెళ్ళి స్టవ్ ఆఫ్‌చేసి వచ్చారు. ఎదురింట్లో ఉన్న కవిత ఒక్కతే హరిత మీద జాలిపడింది.

భర్త చేసిన చర్యలకు ఆమెను నిందించటం నేరం అనిపించింది.

భర్త సుఖాలు అమరుస్తుంటే ఏ భార్య అయినా ఆ సుఖాలు అందుకోవాలనే ప్రయత్నిస్తుంది. స్త్రీగా తోటి స్త్రీమీద కవిత జాలి పడింది. అయోమయంగా కూర్చున్న హరితను తీసుకుని తన ఇంటికి వెళ్ళింది.

ఇరుగు పొరుగు వాళ్ళంతా వెళ్ళిపోయారు.

వాళ్ళంతా ఇవాళ మధ్యాహ్నం అంటే ఈ సంఘటన జరిగేముందు వరకూ హరిత వెంట తిరిగినవాళ్ళే.

హరిత అదృష్టాన్ని ప్రశంసిస్తూ ఆమె నుండి అప్పులు తీసుకున్నవాళ్ళే.


** ** ** ** **

రెండు రోజులు గడిచాయి.

హరితనూ, పిల్లల్నీ కవిత తమ ఇంట్లోనే ఉంచుకుంది.


హరిత తండ్రికి లెటర్ రాసింది కవిత.

శ్రీరామ్ స్నేహితులు ఎంత ప్రయత్నించినా అతనికి బెయిల్ దొరకలేదు.



## సన్నీడియోల్‌కి మంచి రోజులు

'ఘాయల్' చిత్రంతో సన్నీ నటనకు అందరూ అచ్చెరు వొందారట. ఇది అదనుగా తీసుకొని అందరికంటే ఎక్కువ డబ్బులు డిమాండు చేస్తాడేమో నని అనుకుంటున్నారు. 'చాల్‌బాజ్' చిత్రంలో శ్రీదేవికి పోటీగా నటించిన సన్నీ చిత్రం యొక్క బరువు బాధ్యతలన్నీ తన భుజస్కంధాలపై వేసుకున్నాడు. ఇది విజయవంత మైతే సన్నీకి మంచి రోజులు వచ్చినట్టేనని పెద్దలు భావిస్తున్నారట. మంచిదే!



## మీనాక్షి-వినోద్

మీనాక్షి శేషాద్రి మహేష్‌భట్ చిత్రం 'జుర్మ్'లో అత్యంత ప్రతిభావంతంగా నటించిం దట. మీనాక్షి సరసన వినోద్ ఖన్నా నటిస్తున్నాడు. దీనిలో సంగీతాబిజ్‌లానీ కూడా నటిస్తోంది. మరి ఈ చిత్రం ఏ మేరకు విజయం సాధిస్తుందోనని నిర్మాతలు ఎదురు చూస్తున్నారు.

హరిత మానసికంగా కృంగిపోయింది.

కవిత తమ్ముడు రఘు అక్క దగ్గరే ఉండి చదువుకుంటున్నాడు. అతను ఎక్కువగా బైట తిరుగుతూ ఉంటాడు.

అతనికి చాలా విషయాలు తెలిసాయి. వచ్చి అక్కకి చెప్పేవాడు.

శ్రీరామ్‌మీద అవినీతి నిరోధక శాఖవారికి రిపోర్ట్ ఇచ్చింది ఎవరో కవితకు తెలిసిపోయింది.

ఆ మధ్యాహ్నం హరితతో చెప్పింది.

వింటూనే హరిత ఉలిక్కిపడింది. మొదట నమ్మలేకపోయింది. కానీ చెప్పింది కవిత కనుక నమ్మగలిగింది.

శ్రీరామ్ మీద రిపోర్ట్ ఇచ్చింది. ఎవరో కాదు, ఆమె ఇరుగు, పొరుగు ఇళ్ళవారే.

** ** ** ** **

హరితవాళ్ళ పోర్షన్ ఉన్న బిల్డింగ్‌లో ఇంకా ఐదు పోర్షన్‌లు ఉన్నాయి. కింద మూడు, పైన మూడు ఉంటాయి.

నడమంత్రపు సిరి నరాలమీద పుండు అన్నట్టు, సామాన్య కుటుంబంలో నుండి వచ్చిన హరితకు భర్తకోరకుండానే అందిస్తున్న ఐశ్వర్యానికి తలమునకలు అయింది. ఆమెలో అతిశయం హెచ్చు అయిపోయింది.

ఆ బిల్డింగ్‌లో ఉన్న అన్ని పోర్షన్స్‌వారు ఉన్నవారే అయినా వాళ్ళకంటే తామే అధికులం అన్నభావన ఎక్కువ అయింది.

అనుక్షణం డబ్బు సంపాదించటంలో భర్తకుగల చాకచక్యాన్ని అందరితో చెప్తూ ఉండేది. అతను తాళంకప్ప కొన్నా అందరికీ ఆడంబరంగా చూపిస్తూ ఉండేది.

ఇక అందువల్ల శ్రీరామ్ ఇంట్లో ఏ వస్తువుకొన్నా, ఎలా కొన్నా ఆ కాంపౌండ్‌లో అందరికీ తెలిసిపోతూ ఉండేది.

ఒకసారి హరిత తల్లి వచ్చినప్పుడు కూతురి ప్రవర్తన అంతా చూసింది. ఆవిడకు ఏమీ నచ్చలేదు.

"హరితా! రోగం రట్టు, సంసారం గుట్టు అన్నారు. ఇంటి విషయాలు అలా ఒకరితో చెప్పటం మంచిది కాదు. అసలే పైకి వస్తున్న మీరంటే ఇరుగు, పొరుగు వాళ్ళకు ద్వేషం ఉంటుంది" అని ఆవిడ హితబోధ చేసింది.

హరిత మదురు చిట్లించింది.

అది ఆమెకు నచ్చలేదు. ఆమె తత్వమే అంత. ఇంట్లో జరిగిన ప్రతి చిన్న విషయం అందరితోచెప్తే కానీ ఆమె మనసుకు శాంతి ఉండదు. కూతురి సంగతి చిన్ననాటినుండీ తెలిసి ఉన్న ఆమె తల్లి హరితకు నచ్చచెప్పలేకపోయింది.

భార్యలో ఉన్న ఈ స్వభావం శ్రీరామ్‌కు కాస్త తెలిసినా అతను పెద్దగా పట్టించుకోలేదు. అదీకాక అతను ఇంట్లో ఉన్నప్పుడు హరిత ఇరుగు పొరుగు వాళ్ళతో ఎక్కువగా మాట్లాడదు.

హరిత ఎదుట వాళ్ళంతా ఆమెను పొగిడి శ్రీరామ్ ఎన్ని రకాలుగా ఎంత సంపాదిస్తున్నాడో ఆరాలుతీసి ఆమె ద్వారానే అన్నీ తెలుసుకుంటున్నారు. ఆ కాంపౌండ్ ఎదురింట్లో ఉన్న కవిత హరిత మాటలకు జాలిపడేది.

ఒకసారి హరితతో చెప్పింది కూడాను.

"హరితా! మీ రెండుకిలా ఇంటి విషయాలు అందరితో చర్చిస్తారు. అది మంచి పద్ధతికాదు" అంటూ.

హరిత మూతి తిప్పింది.

కవిత చాలా రిజర్వ్‌డుగా ఉంటుంది. ఆమె భర్తకూడా ఒక ప్రభుత్వ ఉద్యోగే.

సంస్కారంతో చెప్పే కవిత మాటలు హరిత అర్థం చేసుకోలేక పోయింది.

హరిత ఇరుగు, పొరుగు వాళ్ళు ఆమె కుటుంబంపై అసూయాగ్నితో రగిలిపోయారు.

వాళ్ళలో వాళ్ళు ఆలోచించుకుని శ్రీరామ్‌మీద అవినీతి నిరోధకశాఖ వారికి తెలియజేసారు. వారి అసూయే ఈనాడు శ్రీరామ్ కుటుంబం మీద దెబ్బకొట్టింది.

ఇంటిగుట్టు అంతా బైటపెట్టిన హరిత వల్లనే సంసారం బజారుపాలు అయింది.

కవిత మాటలు వింటున్న హరిత వెక్కి వెక్కి ఏడ్చింది.

తన దగ్గర గిన్నెలు, పప్పులు, ఉప్పులు, డబ్బు అప్పు తీసుకున్న ఇరుగు పొరుగు తనను ఎందుకలా విమర్శించారో, తను ఇంతకష్టంలో ఉంటే ఒక్కరూ ఎందుకు ఆదుకోలేదో, కనీసం తనను పలకరించటానికి ఎదురింటి వరకూ కూడా ఎందుకు రాలేదో అర్థం అయింది.

అందుకు కారణం వాళ్ళ అసూయే.

వాళ్ళలో ఆ అసూయను పెంచి పెద్ద చేసింది ఎవరోకాదు. తనే. సంసారంగుట్టు, రోగం రట్టు అంటు తల్లి ఏనాడో చెప్పింది. తనే అర్థం చేసుకోకుండా ప్రవర్తించింది.

తను గుట్టుగా సంసారం చేసుకుంటే, తమ ఇంటి విషయాలు ఎవరికీ చెప్పకుండా ఉంటే ఎంతో బాగుండేది.

తన నోటి అదుపులేని తనమే తన భర్తను జైల్‌కు పెట్టింది. తననిలా పరుల పంచను చేర్చింది. తన వల్ల భర్త ఉద్యోగం కూడా పోయింది. ఇది తన స్వయంకృతం. అనుభవించక తప్పదు. తనను చూసి ఎవరైనా గుణపాఠం నేర్చుకోవాలి. హరితకు ఏడ్చి ఏడ్చి గొంతు బొంగురుపోయింది. కవిత చెయ్యి హరిత తలను ప్రేమగానిమురుతోంది.

●